షికారుగా వస్తున్నారు. వారికియ్యి సినేమాను " అన్నాడు. భీముడుగాడు.

ఛేర్‌మేన్‌గారు అలా వచ్చివచ్చి నిలబడి-"ఏం భీముడూ! నీ కీ ప్రొమోషన్ ఎలావుంది ?" అన్నాడు. గురమ్మ దండ యందిచ్చింది. ఛేర్‌మేన్ దండచ్చుకు వాసనచూస్తూ-" దానిచేత తుడిపిస్తున్నావా ఏమిటి నీవు తుడవలేక మోజా ?" అన్నాడు. భీముడుగాడు-" ఏలినవారి దయవుంటే లేదండి ! అసలది వాడు పూలే తుడవదండి కొత్తపూలు ముణుద్దిగాని. నాకు మనుమ రాల్లేండి. సెలవండి దొరగారూ !" అన్నాడు. ఛేరుమేన్ గురమ్మ సిగకేసిచూస్తూ వెస్తుపోతూ వెళ్ళిపోయినాడు.

భీముడుగాడు మనమరాల్ని దగ్గఱకు తీసుకుంటూ-- " నీసిగకేసి చూచిన చూపు నా కాలిపోయిన గుడిసెకేసి చూచి వుంటే బాగుండిపోయాదే మనబతుకు, ఈప్రభువులు చూడరే?" అంటూ ఇంతసే పేడ్చినాడు. వాడికప్పుడు జ్ఞాపకం వచ్చింది క్రితంరోజున కాలిపోయిన గుడిసె అంతా చక్షుసాక్షిగా. గురమ్మ- " తాతా ! నీవు తుడిచేసిన వాడుపూవు లేవీ ? ఎక్కడకు పోగు చేసినావు ?" అంటూ పోయింది దూరదూరంగా ! పెద్దగాలి వేస్తే బాగుండిపోను; అన్నిపువ్వులు రాలిపోతే బాగుండిపోను." యని అనుకుంది తన హృదయంలో. అదే సంఘవిప్లవ మయిపోయింది.

.... .... .... .... ....

## పాడుడిపోతావున్న కోటిలింగాలు

విశేషాలనడంతోనే అందరికీ అతీ సుందరమైందీ, అతీ యద్భుత మైందీ, అతీ వినూతనమైందీ, అతీ యభివృద్ధిలో మున్నదీ,

అవి తట్టుతుంది కాబోలు. ఈ వ్యాసంతో ఆలాంటిదాన్ని గురించి నేను వ్రాయబోవడంలేదు. మిక్కిలీ పాడుపడిపోతూన్నటువంటి, నిర్మానుష్యంగా వున్నటువంటి, అసహ్యాకరంగా జేయబడుతూ వున్నటువంటి యవిసీతిపరుల కాస్కారమవుతూన్నటువంటి ఒకానొక దివ్యక్షేత్రాన్ని గురించి వ్రాయ సమకట్టాను.

కోటిలింగ క్షేత్రమన్నది రాజమహేంద్రవర పురానికి ఉత్తర ధ్రువంలా కనబడుతూవుండే అనాది దివ్యప్రతిష్ట. అది లేకపోతే రాజమహేంద్రవరమనేది లేనేలేదని చెప్పవచ్చు ఒక విధంగా. ఆలాంటి సందర్భంలో ఇప్పుడు దాన్ని చూస్తిమా— గోడలు పడిపోతూన్నాయి. మండపం యరుగులమీద చతుర్ముఖ పురాణం, పణమొడ్డి బాహాటంగా సాగించేస్తూన్నారు తుంటరులు. ఒక్కసారన్నా గంట మోగడంలేదు. నందికొమ్ములమధ్య ఒక్క మారేడుదళమైనా కవిపించడంలేదు.

ఓ సాయంత్రం షికారువెడుతూ చూచాను. నిజంగా కంటమ్మట పీళ్ళొచ్చాయన్నమాట. "శివోహమ" ని దేవతా దర్శనం చేసిపోదామనుకుంటే పూజారికూడా గుడితలుపులు తీసి వుంచలేదు.

"ఇదికాదా కోట్లింగాలు ? దారితప్పి వచ్చానా ?" అన్నంత శోచనీయ భావంతో నలుదెసలా తేరిపార చూచాను. ఎదరతట్టు ప్రకృతరాజ్ఞియగు గౌతమీస్రవంతి గోవుపాదాలంట చిన్ని యలలతో రుతిస్తూన్నట్టయింది. ఉత్తరపుతట్టు కొండ లగపిస్తున్నాయి. అయినాగానీ ఇంకా నమ్మకం నాకు బాగా కుదరలేదు అదే కోటిలింగ పుణ్యక్షేత్రమని—

"శివదేవు నందికి చెంగలి గడ్డేస్తె
సినా నుసీదకూ చెంగలిముందా ?"

అని యిద్దఱు మాలెతలు పాడుకుంటూ ఆ జీర్ణాలయం వెనుక తట్టునున్న మాలపల్లెలోనుంచి అడ్డుదారినే శివునిగుడి ఆవరణ గుండా చెఱియొక పచ్చగడ్డిమోపూ నెత్తిమీద మోసుకుంటూ గోదావరిగట్టెక్కుతూన్నట్టయింది.

వాళ్ళ పాటనుబట్టి వూహిస్తే వాళ్ళు గావించిన చెయ్యి ఏమానిపిస్తైనా తట్టకపోదు. ఒకర్తే గడ్డిపరక రాతినందిముందు పడెయ్యబోతే రెండోది దానియొక్క ఉపయోగాన్ని సృచ్చిం చింది అన్నమాటకదూ! ఇంకా వినండి తరువాయిపాట——

" శిలనేతనందికీ సిరిమువ్వ తగిలిస్తె
బలుపెక్కి పెయ్యకూ బలుపు పుడుతుందా ?"

అంటూ పాడుకుంటూ గట్టుయొక్క మెట్టుదిగి నావెక్కేరు. "మాలెతలైనా వీళ్ళ మొహాల్లో ఏదోవిధమైన మనోహర భావం కందళిస్తూవుంద" ని వాళ్ళకేసి చూస్తూ అలా ఆ నావే నేనూ ఎక్కి——" ఈ దేవాలయంలోకి హరిజనుల్ని రానిస్తూ వున్నారా ఏమిటి ?" అని యడిగాను.

"హరిజనులంటే ఎవరో మాకు తెల్దండీ బాబూ! మేము గరిగ్గడ్డి అమ్ముకు బతికేవాళ్ళమ" న్నారు. "నేను చుక్కాని పడతాను; మీరు తెడ్లువేయండి" అని వారి కోరసిలగా కూర్చుని చుక్కాని పడుతున్నాను. ఆడవాళ్లు వాళ్లు తెడ్లు వేస్తూన్నారు. ఏ వాక్కు నిమేషం మౌగ్ధ్యం వహించారో మళ్ళీ మొదలెట్టారు పదం——

" కూలబడు గుడినంది కొమ్ములంటా చూస్తె
చేలోని యెదమొదవు చూలుగొంటుందా ?
పాలు మెచ్చని వండె గంగడోల్ నవరిస్తె
మాలోళ్ళ గోమాత మనువుగంటుందా ?"

* * *

మేమున్నూ ఆ నావను అలా నడిపించుకుంటూ రాజమ హేంద్రవరపురానికి దక్షిణధ్రువంగాదోచే ఇన్నీసుపేట కిరోసిన్ ట్యాంకుల ఆ రెంకికి చేరుకొన్నాం. ఆరేవులో కోటిలింగాలు లేకపోయినా కోటిసంఖ్యకు మించిన చాకిదల్లు లున్నాయి.

అక్కడ రేవులో కొందరు బ్రాహ్మలు స్నానంచేయిస్తూ వున్నారు. ఎవర్ని ? అప్పుడే పెద్దస్టేన్‌వద్ద యాత్రాస్పెషల్ దిగిన వోఢ్ర వంగజనాన్ని లాక్కొచ్చి గోదావరిలో స్నానం చేయిస్తూన్నారు " కోటిలింగక్షేత్రే పావన గోదావరీతోయే——" అని. మాలెతలు నావంకచూస్తూ——" కోటిలింగాలన్నది మాం వున్నకాద కాదుండీ ?" అని యడిగేరు. " అవు " నన్నాను. " మరిక్కడ తానాలాడుతున్నారేం కోటిలింగ చ్చేత్రమంటా " అని యడిగారు.

" దేవు డంతటా విండివున్నాడు " అని వాళ్ళకేదో సమాధానంచెప్పి నావదిగి పోయినాను నేను. మాలెతలు ఇంకా దిగుదాయ కోకొంచెం మేర నావను తీసుకుపోయి రెల్లుదుబ్బుల్లో కట్టేసుకు గడ్డిమోపులు అంగడికి గొంపోయేరు.

నావదిగిన నేను మాలెతలు వాదుపాడినపాటను మనస్సా స్మరించుకుంటూ, అక్కడ స్నానంచేసే జనాన్ని అంతనూ షోవిచ్చి గోదావరియొక్క ఆవలితీరపు ఆకాశపు టొరగునే తెల్లమౌతూన్న ఔరంగాబాద్ మసీదును గుర్తించి——" ఇది కోటిలింగక్షేత్రముకాదు ; గోవుపాదాల కెదురుగా నున్నదే కోటి లింగక్షేత్రమ " ని దృఢపరుచుకున్నాను. కోటిలింగ క్షేత్ర మన్నది ఈనాడు మిక్కిలీ శిథిలావస్థలోనున్నదనీ, అది శిథిలా వస్థలో నున్నంతకాలం రాజమహేంద్రవర వాస్తవ్యులకు

హిందూమతమ్మీద మనసునిలవదనీ అలా అలా తలపోశాను. తలపోసి తలపోసి ఈ వ్యాసం హైందవజనోపయోగంకుగాను వ్రాశాను.

మన పూర్వపుగుళ్లు పోయాక మనం మహమ్మదీయుల మైతేనేమి ? అని యనుకుంటూ తారీఖు చూచాను. నాడు క్రిష్టమస్‌డే—25-12-1937. క్రైస్తవులమైనా తప్పు లేదని భావించాను కూడాను.

.... .... .... .... ....

# ఎన్ని అమావాస్యలు

మనుష్యు లన్యోన్యం బాగా పోల్చుకుని పలకరించుకునేటంత పాళం తెలివింకా లోకానికి రాలేదు. అప్పుడే తెలతెలవారుతూ వుంది. వాతావరణం సమశీతోష్ణంగావుంది. ఉషశ్రీ తన మేలి ముసుగులోని కాభరణాలుగా ఒక్కొ-క్క-దాన్నే తీసికొంటూ వున్నట్టుగా, చుక్క-లు మాయమైపోతున్నాయి. ఏవీ? లేదొక్క-టీ! కవిపించడంలే దొక్క-టీ! సూర్యుడు ? ఇంకా పైకి రాలేదు. చంద్రుడు ? క్రితం రేత్రి అసలే పొడసూపలేదు.

పాతవాండ్లయినా రస్తామీద నాటి వుదయం వాళ్ళిద్దరూ కొత్తవ్యక్తుల్లా దోచేరు చూచేవాళ్ళకు—చూచేవాళ్ళు ? వాళ్ళను చూచేవాళ్లు ? ఏరీ ? ఎవరూ లేరు !

అది తుడుస్తూ తుడుస్తూ ఆగింది. వాడు నడుస్తూ నడుస్తూ ఆగాడు. ఎక్క-డ ? వానిముందు అది. దానిముందు వాడు.